సాక్షి
శ్రీకాకుళం
సోమవారం, 1, జూలై, 2024



## మా అమ్మను కాపాడండి

ఓ ఇల్లాలు కేన్సర్ బారిన పడ్డారు. ఆమెను కాపాడాలని బిడ్డలు కోరుతున్నారు.
- 8లో




## రోడ్డు ప్రమాదంలో..

ఎత్తురాళ్లపాడు వద్ద జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు.
- 8లో



## గిరిజన హాస్టల్‌లో..

శ్రీకాకుళంలోని గిరిజన హాస్టల్‌లో పిల్లలతో పనులు చేయిస్తున్నారు. ఇది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.
- 8లో

### న్యూస్‌రీల్

## 'ఇండియా కూటమి నేతల వైఖరి సరికాదు'



మాట్లాడుతున్న బిర్లంగి ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇండియా కూటమి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, అనుసరిస్తున్న వైఖరి ఎంత మాత్రం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టి వికసిత భారత్ సంకల్ప దిశగా ప్రభుత్వం దూసుకు పోతుంటే.. ఓర్వలేక రాహుల్ గాంధీ టీమ్ రాజ్యాంగ ప్రతులు చేతబట్టి నిరసన తెలపడం సరికాదన్నారు. ప్రజలు చాలా విజ్ఞులని, వారి మదిలో కాంగ్రెస్ హయాంలో 21 నెలలు పాటు దేశంలో నాటి చీకటిరోజులు ఇంకా మెదులుతున్నారని గుర్తుచేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధీ, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ పారనంది విజయకుమార్, భవన నిర్మాణ కార్మికుల సెల్ జిల్లా కన్వీనర్ గురుగుబెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తెకు ఉత్తమ కలెక్టర్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఈశాన్య ఢిల్లీ కలెక్టర్ రెడ్డి వేదిత

ఎల్.ఎన్.పేట: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె రెడ్డి వేదిత (ఐఎఎస్) ఆదివారం ఉత్తమ కలెక్టర్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు పాతపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈశాన్య ఢిల్లీ కలెక్టర్‌గా పని చేస్తున్న రెడ్డి వేదిత మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణపై తీసుకున్న చర్యలకు గాను ఈ అవార్డును అందుకున్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పక్కాగా అమలు చేసినందుకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (నేషనల్ కమీషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) సూచీల ఆధారంగా ఈ అవార్డును అందజేశారు.

## 9న ఇన్‌స్టెంట్ పరీక్ష



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 9వ తేదీన డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డిగ్రీ చివరి ఏడాది ఐదో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన వారు మాత్రమే అర్హులు. అలాగే ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ కూడా నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీలోపు రూ. 1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## 'ఆదివాసీలు ఐక్యతగా కదలాలి'



మందస మండలం కొండలోగాంలో నినాదాలు చేస్తున్న రైతు కూలీ సంఘ నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం గ్రామంలో కామ్రేడ్ చిలకమ్మ స్మారక స్థూపం వద్ద ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జూన్ 30 సంతాల్ ఆదివాసీల తిరుగుబాటు స్ఫూర్తితో ఆదివాసీ భాష, సంస్కృతి, హక్కుల రక్షణకు పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమం అఖిల భారత ఆదివాసీ కూలీ సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం, శ్రీకాకుళం జిల్లా ఉమ్మడి కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో నాయకులు ఎస్.పున్నయ్య, ఎస్.రాజారావు, ఎస్.దశరథ, ఎస్.మోహనరావు, ఎస్.వాసుదేవరావు, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపికే కీలకం..!

- నేటి నుంచి ఏపీఈఏపీ సెట్-2024 ఇంజినీరింగ్ స్ట్రీమ్ కౌన్సెలింగ్
- జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజీలు, 2682 సీట్లు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఏపీ ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ కౌన్సెలింగ్ నేటి నుంచి మొదలుకానుంది. ఇంజినీరింగ్ తరువాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండటం వల్ల ఈ కోర్సుకు ఎక్కువ మంది ప్రాధాన్యత నిస్తున్నారు. కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల కావటంతో విద్యార్థులు సిద్ధమవుతున్నారు. కాలేజీల ఎంపికే అన్నింటి కంటే కీలకం కానుంది. కౌన్సెలింగ్ ఆన్‌లైన్‌లో జరుగుతుంది. సమస్యలు ఉంటే సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రాసెస్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆన్‌లైన్‌లో సాగుతుంది. సోమవారం నుంచి ఏడో తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 4వ తేదీ నుంచి 10 వరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక, 13వ తేదీన ఆప్షన్ల మార్పు, 16వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. 17వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు. సీట్లు లభించిన విద్యార్థులు 17వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.




బీఆర్‌ఏయూ ఇంజినీరింగ్ కళాశాల



| కళాశాల | సీట్లు |
|---|---|
| డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల | 330 |
| ఐతం, టెక్కలి | 1452 |
| శివానీ, చిలకపాలేం | 480 |
| వెంకటేశ్వరా, ఎచ్చెర్ల | 420 |



తరగతి గదిలో ఇంజినీరింగ్ విద్యార్థులు

**జిల్లాలో 2682 సీట్లు..**

జిల్లాలోని నాలుగు కళాశాలల్లో 2682 సీట్లు ఉన్నాయి. జిల్లాలో చాలా మంది విద్యార్థులు స్థానిక కళాశాలలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పక్క జిల్లా జిల్లాల విద్యార్థులు సైతం జిల్లాలోని కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రభుత్వ సంస్థల్లో మొత్తం సీట్లు కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లాలో సీఎస్‌ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మిషన్ లెర్నింట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు.

**ఇవి చూసుకోవాలి..**

విద్యార్థులు కళాశాలల్లో చేరేముందు నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులు, గత కొన్నేళ్లగా ప్రవేశాలు, ప్లేస్‌మెంట్‌లు, పూర్వపు విద్యార్థులు ఫీడ్ బ్యాక్ ఆధారంగా చేరితే మంచిది. కళాశాల మీద అవగాహన లేకుండా చేరటం వల్ల భవిష్యత్‌తో ఇబ్బంది పడవచ్చు. బ్రాంచ్ కంటే కళాశాల కీలకమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

### విద్యార్థుల ఆసక్తి కీలకం



ఇంజినీరింగ్ కోర్సులో చేరే విద్యార్థుల ఆసక్తి కీలకం. విద్యార్థులు తమకు నచ్చిన బ్రాంచ్‌లో చేరాలి. విషయ పరిజ్ఞానం, సబ్జెక్టుపై పట్టు ఉన్న వారికి మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ రోజు డిమాండ్ ఉన్న బ్రాంచ్‌కు భవిష్యత్‌లో డిమాండ్ ఉండకపోవచ్చు. సాఫ్ట్‌వేర్ రంగంపై కొన్ని బ్రాంచ్‌ల డిమాండ్ ఆధారపడి ఉంటుంది. కొన్ని సార్లు ఈ రంగం సంక్షోభాన్ని సైతం ఎదుర్కొంటుంది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్ ఎంపిక చేసుకుని పూర్తిస్థాయిలో నైపుణ్యం సాధిస్తే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్.

### ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి



కళాశాలల ఎంపిక కీలకం. విద్యార్థులు కళాశాల ఎంపిక చేసుకునే ముందు నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపు, గ్రేడ్‌లు, గత కొన్నేళ్లగా ప్లేస్‌మెంట్‌లు, లభిస్తున్న ప్యాకేజీలు వంటివి తెలుకోవాలి. పూర్వపు విద్యార్థులు ద్వారా తెలుసుకుంటే ఎలాంటి కళాశాలలో చేరితే బాగుంటుంది అన్న అంశంపై అవగాహన వస్తుంది.

– జి.రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

## శ్రీకాకుళంలో సంగీత విభావరి ఏర్పాటు చేస్తా

- ప్రముఖ గాయకుడు మనో



మాట్లాడుతున్న మనో

అరసవల్లి: ఎందరో మహానుభావులైన సంగీత దర్శకుల ప్రోత్సాహంతో ఇప్పటివరకు వేలాది సినీ గీతాలు పాడే అవకాశం వచ్చిందని, ఇప్పుడు కూడా పాటలు పాడుతూనే డబ్బింగ్ కూడా చెబుతున్నానని ప్రముఖ సినీ గాయకుడు మనో అన్నారు. ఆయన ఆదివారం భార్య జమీలాతో కలిసి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే కేవీ మహదేవన్ వంటి వారి వద్ద పనిచేసే అదృష్టం కలిగిందని, తర్వాత చక్రవర్తి, రాజ్‌కోటి, ఇళయరాజా, రెహమాన్‌లతో పనిచేసి ఐదు భాషల్లో వేలాది పాటలు పాడానన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు తానే డబ్బింగ్ చెప్పడం అదృష్టంగా భావిస్తానన్నారు. అలాగే బుల్లితెరల్లో కూడా పలు ప్రోగ్రాంలు చేస్తున్నానని, వచ్చే డిసెంబర్‌లో శ్రీకాకుళంలో భారీగా సంగీత విభావరిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్థానికుల కోరిక మేరకు ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లుగా ఆయన వివరించారు.

**ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు**

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ప్రముఖ సినీ గాయకుడు మనో సతీసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అనివెట్టి మండపంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనాన్ని అందజేశారు. అనంతరం మనో దంపతులు సూర్య నమస్కార పూజలను చేయించుకున్నారు. అలాగే విశాఖపట్నం జీవీఎంసీ కమిషనర్లు నల్లనయ్య, శివప్రసాద్‌లు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అలాగే ఆదివారం ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,14,700, విరాళాలు,పూజల ద్వారా రూ.63,412, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ అధికారులు ప్రకటించారు.



## కారు మబ్బులు కమ్ముతు ఉంటే..

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఆదివారం మబ్బులు కమ్మేశాయి. సాయంత్రం వర్షానికి ముందు నగరమంతా చీకటిగా మారిపోయింది. ప్రజలు, వ్యాపారులు ఒక్క సారిగా తమ వ్యాపారాలు మూసుకుని పరుగులు తీశారు. - కాశీబుగ్గ

## ఇంటర్ విద్య డీవీఈఓగా తవిటినాయుడు



పదవీ విరమణ చేసిన కోట ప్రకాశరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శివ్వాల తవిటినాయుడు, సీనియర్ ప్రిన్సిపాళ్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీవీఈఓ)గా శివ్వాల తవిటినాయుడు నియామకమయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ నిధి మీన ఆదివారం ఉత్తర్వులు వెలువరించారు. నాలుగున్నరేళ్లగా డీవీఈఓగా వ్యవహరిస్తున్న కోట ప్రకాశరావు(ప్రిన్సిపాల్, జీజేసీ టెక్కలి) ఆదివారం పదవీ విరమణ చేయడంతో ఆయనస్థానంలో బూర్జ ప్రభుత్వ జూనియర్‌గా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న తవిటినాయుడు పూర్తి అదనపు బాధ్యతలతో డీవీఈఓగా వ్యవహరించనున్నారు. ఈయన గతంలో ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓగా వ్యవహరించి మెప్పించారు. ఈ నియామకంపై ఆర్‌ఐఓ పి.దుర్గారావు, జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బి.శ్యామ్‌సుందర్, ఆర్.భూషణరావు, ఎం.కృష్ణవేణి, పీవీఎల్ నారాయణ, కీర్తి తవిటినాయుడు, జూనియర్ లెక్చరర్లు, కాంట్రాక్ట్ లెక్చరర్లు, పార్ట్‌టైం, గెస్ట్ లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తవిటినాయుడు జిల్లా ఇంటర్ విద్య వృత్తిశాఖాధికారి కార్యాలయంలో డీవీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఆకట్టుకున్న స్వేచ్ఛా నృత్యతరంగిణి చిన్నారుల నాట్యం



నాట్యకారులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనక దుర్గమ్మ వారి ఆలయంలో పట్టణానికి చెందిన శ్రీస్వేచ్ఛా నృత్యతరంగిణి నాట్యకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపదం నృత్య ప్రదర్శనలతో అలరించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక నృత్య పోటీల్లో శ్రీస్వేచ్ఛా నృత్య తరంగిణి నాట్యకారులు మంగి దివ్య, కె.కుమార్, డి.శిరీష, బి.భవాని, పి.వర్షిత, బి.నయని, కృతజ్ఞ, సత్యశ్రీ, ఉపాసన, జోషిక, వర్షిణి, సంజన, తనూజ, శరణ్య, యశ్విత వారి నృత్య ప్రదర్శనలతో అలరించారని అకాడమీ అధ్యక్షుడు కె.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక అధికారులు స్థానిక అకాడమీ చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు గొట్టా బ్యారేజీ వద్ద
# వంశధార నీరు విడుదల

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు

నరసన్నపేట: ఖరీఫ్ సాగు పనులకు వీలుగా సోమవారం వంశధార కాలువల్లో సాగు నీటిని గొట్టా బ్యారేజీ వద్ద విడుదల చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని వంశధార అధికారులకు ఆదేశించారు. జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు వంశధార ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. వీలున్నంత వరకూ శివారు భూములన్నింటికీ సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు ఇంజినీర్లకు తగు సూచనలు చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం వంశధార అధికారులతో సమీక్ష చేశారు. గత ప్రభుత్వం సాగు నీటిపై పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు.

సాగునీటి కాలువల తాత్కాలిక మరమ్మతుల కోసం ఇప్పటికే రూ.1.30 కోట్లు విడుదల చేశామని, పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. వంశధార కాలువలను శాశ్వత స్థాయిలో మరమ్మతులు చేసేందుకు రూ.350 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వీటికి అనుమతులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నీటి సరఫరా సాధ్యాసాధ్యాల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలో రానున్న ఖరీఫ్‌కు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి ఎకరాకూ సాగు నీరు అందిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, పాతపట్నం, పలాస, నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్‌తో పాటు వంశధార ఎస్‌ఈ రాంబాబు తదితరులు పాల్గొనగా వంశధార నీటి విడుదల, పంపిణీపై చర్చించారు. తమ ప్రాంతానికి ముందుగా నీరు పంపాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. అలాగే పాతపట్నం, నరసన్నపేట ఎమ్మెల్యేలు కూడా మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అచ్చెన్నాయుడు అన్నారు. కార్యక్రమాల్లో కూటమి శ్రేణులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో వంశధార అధికారులు, నరసన్నపేటకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గొట్టా బ్యారేజీలో ఉన్న నీటి నిల్వ

**గొట్టా బ్యారేజీ వద్ద ఏర్పాట్లు పూర్తి**

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గొట్టా బ్యారేజీ డీఈ రంగనాయకులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా లేకున్నా అధికారులు ముందుచూపుతో వ్యవహరించి బ్యారేజీలో కొంతవరకూ నీటిని నిల్వ ఉంచారు. ఖరీఫ్ అవసరాలకు తగిన విధంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో పడిన వర్షాలకు బ్యారేజీలో వరదనీరు 1050 క్యూసెక్కుల వరకు వచ్చి చేరుతుంది. బ్యారేజీలో 37.8 మీటర్ల నీటిమట్టం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు తగ్గ నీరు బ్యారేజీలోకి చేరింది. ఈ ఏడాది శివారు ఆయకట్టుకు సైతం సాగునీరు అందించగలమనే నమ్మకంతో ఉన్నట్లు తెలిపారు.

## కోటి లింగాల పుష్పం







శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన పుష్పాల్లో కోటి లింగాల పుష్పం ఒకటి. ఈ కుసుమాన్నే నాగ లింగ పుష్పం, శివలింగ పుష్పం, నాగమల్లి పుష్పం, మల్లికార్జున పుష్పం అంటుంటారు. ఈ పుష్పాల మధ్య భాగం పడగ విప్పిన సర్పం వలే ఉంటుంది. ఈ పుష్పాల చెట్లు శివుని జటాజూటాల ఆకృతిలో ఉంటాయి. మండపల్లి శివాలయం దగ్గర ఈ పుష్పాలు కనిపించాయి.

- ఇచ్ఛాపురం రూరల్

## క్లుప్తంగా

### ఉత్కళ సమ్మిళని ద్వారా ఒడియా విద్యకు మరింత మెరుగు



సమావేశంలో ఏపీ ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి, ఉపాధ్యాయులు

**కంచిలి:** ఉత్కళ సమ్మిళని సంస్థ ద్వారా మరింత మెరుగ్గా ఒడియా విద్య బోధనకు అవకాశం ఏర్పడుతుందని ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి అన్నారు. మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్కళ సమ్మిళని విద్యా వలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవీ విరమణ, పదోన్నతి ద్వారా ఖాళీ ఏర్పడిన, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 130 మంది ఉత్కళ సమ్మిళనీ విద్యా వలంటీర్లను నియమించడం జరుగుతుందని అన్నారు. గత విద్యా సంవత్సరం పనిచేసిన వలంటీర్లకు పారితోషికం అందించడం జరిగిందని, పెరిగిన రూ.1500లు జీతం త్వరలో జమ అవుతుందని తెలిపారు.

ఉత్కళ సమ్మిళనీ వలంటీర్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా విద్యార్థులను చేర్పించి ఒడియా చదివే వారి సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రతి విద్యార్థి రాయడం, చదవడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్చుకొనే విధంగా తీర్చిదిద్దాలని ఒడియా డీఐ దుర్గాప్రసాద్ సూచించారు. సమావేశంలో ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాఢి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

### స్వగ్రామానికి చేరిన యువకుడి మృతదేహం



యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

**వజ్రపుకొత్తూరు రూరల్:** మండలంలో గల చినవంక గ్రామానికి చెందిన యువకుడు మదనాల శంకర్ అలియాస్ సతీష్ (32) సౌదీ అరేబియాలో జూన్ 5న మృతి చెందాడు. అయితే దాదాపుగా 25 రోజుల నిరీక్షణ తర్వాత యువకుడి మృతదేహం ఆదివారం గ్రామానికి చేరుకుంది. శంకర్ మృతదేహాన్ని ఎలాగైనా స్వగ్రామానికి తీసుకురావాలన్న కుటుంబ సభ్యుల ప్రయత్నం ఫలించింది. మృతదేహం సౌదీ అరేబియా నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్ లో స్వగ్రామానికి తీసుకువచ్చారు. శంకర్ మృతదేహం చూడగానే కుటుంబ సభ్యులు, బంధువులు భోరున విలపించారు. పరిసర జీడి తోటల్లో అంత్యక్రియలు చేశారు.

### ఒడిశాలో ఆంధ్రా యువకుడి హత్య..?



సంఘటన స్థలంలో మృతి చెందిన బాలు

**ఇచ్ఛాపురం రూరల్:** బీచ్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ యువకుడి ప్రాణాలు తీసింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని కేదారిపురం గ్రామానికి చెందిన కొందరు ఆదివారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు స్వర్ణాపురం బీచ్‌కు వెళ్లారు. అదే బీచ్‌కు వచ్చిన ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన యువకులతో వీరికి చిన్నపాటి గొడవ జరిగింది. సమస్య అక్కడితో ముగిసిపోయిందని భావించిన కేదారిపురం యువకులు సాయంత్రం ఇంటికి వచ్చేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. అప్పటికే దారిలో కాపు కాచిన ఇచ్ఛాపురం యువకులు మరోమారు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా కేదారిపురం గ్రామానికి చెందిన ఆశి బాలు(26) అనే యువకుడి ఛాతీపై బలమైన ఆయుధంతో దాడి చేయడంతో బాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి స్నేహితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఒడిశా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని శవ పంచనామాకు బరంపురం తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న తల్లి ఆశి సావిత్రి కన్నీరు మున్నీరుగా విలపించింది. హత్యకు గల కారణాలు, హత్య చేసిన వ్యక్తి ఇంకా ఎవరు అనేది స్పష్టత లేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒడిశా పోలీసులు తెలిపారు.

# మా అమ్మను కాపాడండి

- కేన్సర్‌తో బాధ పడుతున్న ఇల్లాలు
- అమ్మను కాపాడాలంటూ ఇద్దరు కుమార్తెల విన్నపం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బండి స్వాతి

**నరసన్నపేట:** మండలంలోని దేవాది గ్రామానికి చెందిన బండి స్వాతి కేన్సర్ వ్యాధితో పోరాడుతోంది. 30 ఏళ్ల ప్రాయంలోనే ఆమె ఈ వ్యాధి బారిన పడింది. ఆమె భర్త కృష్ణ జాతీయ రహదారి పక్కన ఒక హోటల్ వద్ద టైర్లకు పంక్చర్లు వేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. గుట్టుగా సంసారాన్ని లాక్కుని వస్తున్న తరుణంలో స్వాతికి కేన్సర్ అని రెండున్నరేళ్ల కిందట తెలిసింది. అప్పటి నుంచి వివిధ రకాలుగా చికిత్స చేస్తూనే ఉన్నారు. ఆరోగ్య శ్రీలో ఆపరేషన్ కూడా చేశారు. అయినా ఆమె ఆరోగ్యం మెరుగు పడలేదు. ప్రస్తుతం విశాఖలోని మెడీకవర్ కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. రోజుకు రూ. 15 వేలు వరకూ ఖర్చవుతోంది. ఆరోగ్య శ్రీ వర్తిస్తున్నా.. అదనపు ఖర్చులను తాను భరించలేకపోతున్నానని భర్త కృష్ణ అంటున్నారు. దాతలు సహకరిస్తే తన భార్య ఆరోగ్యం మెరుగు పడుతుందని భావిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు కూడా తల్లి కోసం తల్లడిల్లిపోతున్నారు. తల్లి ఆరోగ్యం బాగుపడాలని గుళ్లు గోపురాలు తిరుగుతున్నారు. మీరే మా అమ్మని రక్షించాలి. మాకు అమ్మను ఇవ్వండి అని స్వాతి పిల్లలు మోహిని, యోగిత విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రస్తుతం కేన్సర్ చికిత్స అనంతరం బోన్‌మేరో ట్రీట్‌మెంట్ అవుతోందని, సాయం చేయాలనుకునే వారు **7095360268** నంబర్‌ను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

## పాము కాటుతో దివ్యాంగురాలు మృతి

**టెక్కలి రూరల్:** మండలంలోని తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన గూన సరోజినమ్మ (55) అనే దివ్యాంగురాలు పాముకాటుకు గురై మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతురాలు తన అన్నయ్య గూన జగ్గారావుతో కలసి వారి ఇంటిలో ఉంటున్నారు. అయితే శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటిలో పడుకుని ఉండగా గుర్తు తెలియని పాముకాటు వేయడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ–2 వెంకటేశ్వరరావు వివరాలు సేకరించి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## కత్తితో దాడి.. ముగ్గురికి గాయాలు



తీవ్రగాయాలకు గురైన కానిస్టేబుల్ విశ్వనాథం

**టెక్కలి రూరల్:** మండలంలోని వలేసాగరం గ్రామంలో ఆదివారం జరిగిన తగాదాలో భాగంగా బంగారి రాము అనే వ్యక్తి కత్తితో ముగ్గురిని గాయపరిచినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. ఈ మేరకు బాధితుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాముకు తన భార్య ఉషాకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. వాటిని సరి చేసేందుకు రాము మామయ్య నివగాన రామారావు, బావమరిది కుమార్ మరో వ్యక్తిలుండు విశ్వనాథం(కానిస్టేబుల్)లతో కలసి వలేసాగరంలోని రాము ఇంటికి వెళ్లారు. మాటలు కాస్తా గొడవగా మారడంతో రాము ఇంటిలో ఉన్న చాకు తీసుకువచ్చి తన మామ రామారావు కడుపుపై పొడిచాడు. బావమరిది కుమార్ మెడపై దాడి చేసేందుకు ప్రయత్నించగా కానిస్టేబుల్ అడ్డుకోవడంతో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉన్న కానిస్టేబుల్ విశ్వనాథంను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై నివగాన రామరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్‌ఐ–2 వి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వివాహితపై దాడికి యత్నం

**శ్రీకాకుళం క్రైమ్ :** ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో కేసు రాజీ పడలేదని దారి కాచి ఓ వివాహితపై వ్యక్తి దాడి చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్‌ఐ కామేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు.. గూనపాలెం పోలాడ వారి వీధి నీలమ్మతల్లి గుడి సమీపంలో నివసిస్తున్న ఓ వివాహిత బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తుంది. ఈమెకు కొన్నేళ్ల కిందటే నగరానికి చెందిన ఆకుల సురేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆ విషయం భర్తకు తెలియడంతో ఆమె సురేష్‌ను దూరం పెట్టింది. దీంతో గత ఏడాది డిసెంబరు 23న నగరంలోని ఓ చికెన్ షాపు వద్ద ఆమెపై దాడి చేయడంతో ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. దీనిపై జూన్ 29న (శనివారం) లోక్‌అదాలత్‌లో కేసు రాజీ పడేందుకు సురేష్ యత్నించినా వివాహిత అంగీకరించలేదు. అదే రోజు రాత్రి తన కుమారునికి ఫిట్స్ రావడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి రాత్రి ఇంటికొచ్చింది. బ్యూటీ పార్లర్ సెంటర్ వద్ద తన స్కూటీ ఉండిపోవడంతో తెచ్చేందుకు వెళ్లి తిరిగి పదిన్నర గంటల సమయంలో వస్తుండగా సురేష్ ఆమెను పిలిచి గొడవ పడ్డాడు. తీవ్ర దుర్భాషలాడుతూ కాలితో తన్నాడు. బండి తీసి వెళ్లిపోతుండగా పిడిగుద్దులు గుద్దాడు. మళ్లీ రిపోర్ట్ ఇస్తే నీ సంగతి చూస్తానని బెదిరించాడని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

- కళాశాలల నుంచి ఇండెంట్ స్వీకరణ
- ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లాకు చేరుకోనున్న పుస్తకాలు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మళ్లీ పాఠ్యపుస్తకాలు అందజేసేలా ఇంటర్మీడియెట్ విద్య ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ ఏడాది నుంచి అకాడమీ నుంచి పాఠ్య పుస్తకాల ముద్రణ చేపించి ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో చదువుతున్న మధ్యతరగతి, నిరుపేద విద్యార్థులకు వీటిని అందజేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ కూడా అందజేయనున్నారు. కాలేజ్ బ్యాగ్ పంపిణీ చేస్తారనే ప్రచారం ఉన్నప్పటికీ అధికారికంగా ఎలాంటి ఆదేశాలు అధికారులకు చేరలేదు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

పునర్విభజన శ్రీకాకుళం జిల్లా(30 మండలాలు)లో 38 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 13 మోడల్ స్కూల్/కాలేజీలు, 25 కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్ 9, హైస్కూల్ ప్లస్ 12, ట్రైబల్ వెల్ఫేర్, మహాత్మా జ్యోతిభాపూలే రెసిడెన్షియల్ కాలేజ్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ప్రథమ సంవత్సరం 13,250 మంది, రెండో సంవత్సరం 12,510 మంది చదువుతున్నారు. గత రెండేళ్లుగా పాఠ్య పుస్తకాల ముద్రణ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాళ్లు, లెక్చరర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేసేందుకు సమ్మతించింది. వీటితోపాటు నోట్‌బుక్స్ కూడా అందజేయనుంది.



ఇంటర్మీడియెట్ అకాడమీ పాఠ్యపుస్తకాలు

**ప్రతిపాదనలు సిద్ధం చేశాం..**



అకాడమీ పుస్తకాలు తగినంత స్థాయిలో ముద్రణ జరగక జిల్లాకు రాకపోవడం వల్ల పుస్తకాలు అందజేయలేకపోయాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటర్ విద్య కమిషనర్ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈనెల 15వ తేదీనాటికి జిల్లాకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు చేరుకుంటాయి.

– కోట ప్రకాశరావు, డీవీఈఓ, ఇంటర్ విద్య

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాతారావు

**కోటబొమ్మాళి :** జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పురిటి తాతారావు (42) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోటబొమ్మాళి పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. టెక్కలి మండలం రావివలస పంచాయతీ దామోదరపురం గ్రామానికి చెందిన పురిటి తాతారావు, కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడు గ్రామానికి చెందిన యండ నర్సింహమూర్తిలు ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్నారు. వీరిరువురూ ఆదివారం నరసన్నపేటలో పనిచూసుకుని టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎత్తురాళ్లపాడు వచ్చేసరికి వెనుకగా వస్తున్న డీసీఎం వ్యాను ఒక్కసారిగా ఢీకొట్టడంతో రోడ్డుపై ఇద్దరూ పడిపోయారు.

అదే సమయంలో అటుగా వస్తున్న మరో గుర్తు తెలియని వాహనం అతివేగంతో రోడ్డుపై పడి ఉన్న తాతారావుపైనుంచే కాక నర్సింహమూర్తి ఎడమచేతి మీద నుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే తాతారావు మృతిచెందగా, నర్సింహమూర్తి చేయి నుజ్జునుజ్జయిపోయింది. స్థానికులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి నర్సింహమూర్తిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**కుటుంబానికి తానే ఆధారం..**

మృతుడు తాతారావుకు భార్య స్వాతి, కుమారుడు రాకేష్‌లతో పాటు తల్లిదండ్రులు శీనమ్మ, చిన్నవాడు ఉన్నారు. కుటుంబం మొత్తం తాతారావు జీతంతోనే జీవనం సాగిస్తున్నారు. ఘటనా స్థలి వద్ద తాతారావు భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు. తాతారావు మృతితో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాళి పోలీసులు చెప్పారు. డీసీఎం వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన నర్సింహమూర్తి

## సంగీత కళాకారుడు కృష్ణారెడ్డికి మహానంది పురస్కారం



ఆశి కృష్ణారెడ్డిని మహానంది పురస్కారంతో సత్కరిస్తున్న తెలుగువెలుగు సాహితీ ప్రతినిధులు

**ఇచ్ఛాపురం:** పట్టణానికి చెందిన శాస్త్రీయ సంగీత కళాకారుడు ఆశి కృష్ణారెడ్డికి తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు మహానంది పురస్కారంతో సత్కరించారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని పీవీ నరసింహరావు జయంతి ఉత్సవాలు–2024 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన కళాకారులకు మహానంది జాతీయ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వ కళా విరాట్ బ్రహ్మ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ రాజ్‌కుమార్ లు మహానంది పురస్కారాన్ని అందించారు.



### ● భారీ.. లారీ

ఇదేదో యుద్ధానికి వెళ్తున్న వాహనంలా ఉంది కదూ.. అదేమీ కాదులెండి. సాధారణ వాహనమే. కాకపోతే దాదాపు 60 చక్రాలతో భారీగా ఉండడంతో రోడ్డుపై వెళ్తున్న వారంతా ఆశ్చర్యంతో చూశారు. విశాఖ నుంచి ఒడిశాకు ఈ లారీపై భారీ ట్యాంకును తరలిస్తున్నారు. పొందూరు–రాజాం ప్రధాన రహదారిలో వాహనం కనిపించడంతో అంతా ఆసక్తిగా గమనించారు.

– జి.సిగడాం

## ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక ఏకపాత్ర పోటీలు



నిబంధనల కరపత్రం ఆవిష్కరిస్తున్న కళాకారులు

**శ్రీకాకుళం కల్చరల్:** ఉత్తరాంధ్ర స్థాయిలో 'పురుషోత్తం సూర్యనారాయణ స్మారక పౌరాణిక ఏకపాత్రాభినయ' పోటీలు ఆగస్టులో నిర్వహించే నెలవారీ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ వద్దగల రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని కళాకారులు, ఉత్సాహవంతులు పాల్గొనవచ్చని అన్నారు. ఏకపాత్ర నిడివి 12 నుంచి 15 నిమిషాలకు మించరాదని, పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.300లు ఫోన్‌పే ద్వారా 9440347848 నంబరుకు చెల్లించాలని కోరారు. వారు ప్రదర్శించే ఏకపాత్ర వీడియోను దిగువన తెలిపిన ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని, దాంతో పాటుగా అడ్రసు, ఫోన్ నంబరు కచ్చితంగా తెలియజేయాలన్నారు. స్క్రూటినీ ద్వారా ఎంపికైన వారు మాత్రమే పోటీలో పాల్గొనడానికి అర్హులని, వారికి ఫోన్ ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

కళాకారుల మేకప్‌లు, డ్రస్సులు, హార్మోనిస్టును వారే సమకూర్చుకోవాలని, ఇక్కడ సంస్థ వారు హార్మోనియం, సాధారణ లైటింగ్, మైకు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే కళాకారులకు భోజన సదుపాయాలు తామే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేవలం పౌరాణిక ఏకపాత్రలు మాత్రమేనని జానపద, చారిత్రాత్మక, సాంఘిక అంశాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు, ముగ్గురికి కన్సొలేషన్ బహుమతులుగా రూ.వెయ్యి ఒక్కొక్కరికి అందజేస్తామన్నారు. జూలై 10వ తేదీ లోగా ఎంట్రీలు పంపించాలని సూచించారు. ప్రవేశ రుసుం, ఏకపాత్ర విడియోలు బి.రామచంద్రదేవ్ 9440347848, టీకి వీరభద్రాచారి 9866279499, ఐ.రమణారావు 9441320125 నంబర్లకు పంపాలని తెలిపారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి బంటుపల్లి రామచంద్ర దేవ్, ఉపాధ్యక్షులు కలగ గణేష్‌యాదవ్, పాట్నూరు వెంకటరావు, న్యాయ సలహాదారు కంచరాన అప్పారావు పాల్గొన్నారు.

## పార్వతీపురంలో వైశ్యరాజు జ్యూయలర్స్



వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

**పార్వతీపురం టౌన్ :** పట్టణంలోని పద్మశ్రీ థియేటర్ ఎదురుగా వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్‌ను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ.. పార్వతీపురం, రాయగడ ప్రాంత కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు కొత్త షోరూమ్ ప్రారంభించామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైశ్యరాజు ఫల్గుణ రాజు, వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్‌రాజు, వేంకటేశ్వర జ్యూయలర్స్ ప్రతినిధులు బెలగాం జయబాబు, యిండుపూరు గోపాలరావు, యిండుపూరు గున్నేశ్వరరావు, యిండుపూరు గుంపస్వామి, బరాటం వెంకటరమణమూర్తి, జల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

## గిరిజన హాస్టల్‌లో విద్యార్థులతో పనులు



ఫ్యాన్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు



హాస్టల్ గదులు కడుగుతున్న విద్యార్థులు

**శ్రీకాకుళం:** శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులతో హాస్టల్ పనులు చేయించడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హాస్టల్‌లో సుమారు 15 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రతి రోజు ఇద్దరు, ముగ్గురు మినహా ఇతర ఉద్యోగులు విధులకు హాజరు కావటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులు మూడు రోజుల కిందట కల్తీ ఆహారం తిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం బయటకు తెలియనీయకుండా హాస్టల్ ఇన్‌చార్జి జాగ్రత్త పడ్డారంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు విద్యార్థుల పరిస్థితి గుర్తించి సిబ్బంది హాస్టల్‌కు వెళ్లి పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థులు పనిచేస్తున్న విషయం వీరి ద్వారానే వెలుగులోకి వచ్చింది. వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులను పరీక్షించేందుకు హాస్టల్‌కు వెళ్లగా హాస్టల్‌లో పిల్లలు గచ్చులు కడగటం, ఊడ్చటం, మరుగుదొడ్లు కడగటం, సీలింగ్ ఫ్యాన్లు శుభ్రపర్చడం వంటి పనులు చేస్తూ కనిపించారు. ఈ సమయంలో వంట చేసే వ్యక్తి తప్ప మరెవ్వరు హాస్టల్‌లో లేరు. ఆరోగ్య సిబ్బంది ఇక్కడి పరిస్థితిని వారి పై అధికారులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. ఇంతలో ఆరోగ్య సిబ్బంది, మీడియా వచ్చిన విషయాన్ని తెలుసుకున్న హాస్టల్ వార్డెన్, మరో ఉపాధ్యాయుడు అక్కడికి చేరుకుని వీడియోలు, ఫొటోలు తీస్తున్న వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫొటోలు బయటకు వెళ్లినా, వార్తలు వచ్చినా పరిస్థితి తీవ్రంగా ఉంటుందని మీడియా ప్రతినిధులకు హెచ్చరించారు. వివరణ ఇచ్చేందుకు, వారి పేర్లు చెప్పేందుకు కూడా నిరాకరించారు. అప్పటి వరకు ప్రతి రోజు తమతో పనులు చేయిస్తున్నారని చెప్పిన విద్యార్థులు వార్డెన్ వచ్చిన తర్వాత భయపడి మాట మార్చేశారు. ఆదివారం పనివారు రాకపోవటంతో తాము ఈ పనులు చేస్తున్నామని అన్నారు.